గడప గడపకూ... వందో రోజు



శాంతనపురి కాలనీలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత

- గొడారిగుంటలో ఎమ్మెల్యే కన్నబాబు పర్యటన
- భారీగా హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కాకినాడ రూరల్: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూరల్ నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వందో రోజు కార్యక్రమాన్ని కాకినాడ అర్బన్ 3వ డివిజన్ గొడారిగుంట శాంతనపురి కాలనీలో శుక్రవారం పండగ వాతావరణంలో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్ ఆధ్వర్యంలో గొడారిగుంట మూడుగుళ్ల సెంటర్ వద్ద ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ రమేష్, అడిషనల్ కమిషనర్ నాగ నరసింహారావు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి శాంతనపురి కాలనీలో మధ్యాహ్నం 3 గంటల వరకూ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌లను అందించి, వాటి లబ్ధిని తెలియజేశారు. సాంకేతిక సమస్యలతో పింఛన్లు, పథకాలు అందడం లేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వాటిని కమిషనర్, సచివాలయ ఉద్యోగులకు తెలియజేసి వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం ఎంపీ వంగా గీత హాజరై ఎమ్మెల్యేతో కలసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, రూరల్ నియోజకవర్గంలో వంద రోజులు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, 3వ డివిజన్‌కు చెందిన జగన్నాథం, నేరేళ్ల, కృప, భువనేశ్వరి తదిరులు పాల్గొన్నారు.

లబ్ధి పొందుతూ ప్రభుత్వంపై దుష్ప్రచారమా?



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి తదితరులు

- ఇష్టం లేకపోతే పథకాలు వెనక్కి ఇచ్చేయండి
- టీడీపీకి ఎమ్మెల్యే ద్వారంపూడి హితవు

కాకినాడ: ఒకవైపు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతూనే మరోవైపు టీడీపీ నేతలు ఇదేం ఖర్మ అంటూ చేస్తున్న ప్రచారం హాస్యాస్పదంగా ఉందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. టీడీపీ ఆదేశాల మేరకు ఇదేం ఖర్మ పేరుతో ప్రజల్లోకి వెళ్లాలనుకుంటే తీసుకుంటున్న పథకాలను వెనక్కి ఇచ్చేయాలని ఆయన టీడీపీ నేతలకు హితవు పలికారు. స్థానిక 12వ డివిజన్‌లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అధికారులు ఉన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ స్థానికులు చెప్పిన సమస్యలను సత్వర పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ చేస్తోన్న 'ఇదేం ఖర్మ' కార్యక్రమంపై మండిపడ్డారు. పేదలకు చేయూత, డ్వాక్రా రుణాల మాఫీ, అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి అనేక పథకాలను ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వనమాడితో పాటు తిరుగుతున్న ఎంతో మంది ఆ పార్టీ నేతలు ప్రభుత్వ పథకాలు సొమ్ము తింటూనే ఇలా వ్యవహరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజల్లోకి వస్తున్న టీడీపీ నేతలకు జగన్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను వివరిస్తూ వాస్తవాలను చెప్పాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్ కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, రోకళ్ల సత్యనారాయణ, నాయకులు మట్టపర్తి రఘురామ్, పరుశురామ్, జితేంద్రసింగ్, కోనాడ దుర్గాప్రసాద్, డీఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత ద్రవ్యాభిషేకం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు శతానువాక నవగ్రహానువాక పూర్వక అష్టోత్తర శత ద్రవ్యాభిషేకాల అర్చన వైభవంగా జరిగింది. ఈ పూజలను టీటీడీ వేద పండితుడు హోతా శివభాస్కరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం చతుర్వేద పండితుల ఆధ్వర్యంలో శత ద్రవ్యాభిషేకం చేశారు. పుణ్యాహవచనం, గోపూజ, మహాన్యాసం, మండపారాధన, కలశస్థాపన, 108 ద్రవ్యాల సంప్రోక్షణ, బిల్వార్చన, పుష్పార్చన, సూర్య నమస్కారాలు, అమ్మవారికి నవవర్ణార్చన చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు 108 కలశాలతో ఊరేగింపుగా జగన్నాథపురం విఘ్నేశ్వర ఘాట్ వద్దకు చేరుకుని ఆ నీటిని గంగలో కలిపారు. ఆలయం వద్ద కేరళ చెండై వాయిద్యం భక్తులను ఆకట్టుకుంది. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి తెలిపారు. ఆలయంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం నిర్వహించేందుకు కలశాలను ఆయన పండితులకు అందించారు. అనంతరం బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్లు రాగిరెడ్డి అరుణ్‌కుమార్, రోకళ్ల సత్యనారాయణ, ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





అభిషేకం చేస్తున్న పండితులు, పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు

మార్చి నాటికి టిడ్కో గృహాలు

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ: టిడ్కో గృహాలను మార్చి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం స్థానికంగా ఆయన తన కార్యాలయంలో నగరపాలక సంస్థ, టిడ్కో అధికారులతో గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, టిడ్కో ఈఈ రీటా, టీపీఆర్‌ఓ మానే కృష్ణమోహన్ తదితరులు హాజరయ్యారు. టిడ్కో గృహాల ప్రగతిని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2,056 ఇళ్లకు సంబంధించి ఆ ప్రాంతంలో అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు కావాల్సి ఉందని, ఈ ప్రక్రియ కూడా వేగవంతం చేయాలని అన్నారు. అన్ని పెండింగ్ పనులు పూర్తి చేసి మార్చి నాటికి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ మాట్లాడుతూ రుణాల మంజూరుకు సంబంధించి ఇప్పటికే అనేకసార్లు బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే మిగిలిన లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులు హాజరయ్యారు.



టిడ్కో గృహాలపై అధికారులతో సమీక్షిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

పేదింట వెలుగులు నింపడమే ధ్యేయం



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: పేదల ఇంట వెలుగులు నింపడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన కొత్త పింఛనుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో పింఛను పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నారని అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటికి వచ్చి మరీ సొమ్ము ఇస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారుల చెంతకే చేరుస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కరప మండలంలో 11,524 మందికి ప్రతి నెలా పింఛన్లుగా రూ 3.14 కోట్లు ఇస్తున్నారని, కొత్తగా 356 మందికి పింఛన్లు మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రే పెద్ద కొడుకులా ఇంటికి వచ్చి, పింఛన్ ఇస్తున్నట్లుగా ఉందని గ్రామాల్లోకి వెళ్లిన తమకు లబ్ధిదారులు చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము పెంచారన్నారు. ఇది చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా స్థానిక నాయకుల దృష్టికి కాని, తన దృష్టికి కానీ తీసుకురావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి వచ్చే ఎన్నికలలో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ గుత్తుల భీమశంకరరావు, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

నాగమల్లితోట జంక్షన్: మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పిఠాపురం పాలిటెక్నిక్ కళాశాలకు అవసరమైన ఫర్నిచర్ సమకూర్చడానికి చర్యలు తీసుకుంటానన్నారు. డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ 27 పాలిటెక్నిక్ కళాశాల నుంచి విద్యార్థులు పోటీలకు హాజరయ్యారన్నారు. క్రీడా స్ఫూర్తితో అంతా ముందుకు సాగాలన్నారు. అనంతరం జాతీయ జెండాను వంగా గీత, కళాశాల జెండాను నాగరాణి ఆవిష్కరించారు. రీజినల్ జాయింట్ డైరెక్టర్ జె.సత్యనారాయణ మూర్తి, జీపీటీ ప్రిన్సిపాల్ టీవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం

కాకినాడ సిటీ: కోడిపందేలను వదిలి సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని కాకినాడ ఆర్డీవో బీవీ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయిలో రెవెన్యూ, పోలీస్, పశుసంవర్ధక, ఎక్సైజ్ శాఖలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏ విధమైన కోడి పందేలు నిర్వహించరాదన్నారు. ఎక్కడైనా బరులు ఏర్పాటు చేస్తే వాటిని గుర్తించి తొలగించాలని, దీనిపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి హైకోర్టు ఉత్తర్వులను పక్కాగా అమలు చేయాలని ఆర్డీవో ఆదేశించారు. యానాం ప్రాంతం నుంచి అక్రమ మద్యం రవాణా కాకుండా నిరోధించాలని, పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయాలని అబ్కారీ శాఖను ఆదేశించారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ పండగల వేళ అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదన్నారు. రవాణా శాఖ అధికారి చిన్నారావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బీవీ రమణ

కార్మికులకు ప్రోత్సాహకాలు

కరప: స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన పండ్లు, హాట్ బాక్స్‌లను గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అందజేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని వేళంగికి చెందిన ఏఐఎం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గాడ్విన్ ఈ ప్రోత్సాహకాలు సమకూర్చగా వేళంగి, కరప గ్రామాలకు చెందిన 50 మంది పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు.సర్పంచులు వాసంశెట్టి శ్రీనుబాబు, వాసంశెట్టి రామారావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

కాకినాడ రూరల్: తిమ్మాపురం అవంతినగర్‌లో పట్టపగలే చోరీ జరిగింది. అవంతినగర్‌లో కొమ్మల కంటి వంశీకృష్ణ ఇంట్లో గురువారం ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.75 వేల విలువైన 38 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై నాగార్జునరాజు తెలిపారు.

స్టాఫ్‌నర్సుపై ఫిర్యాదు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్ ఎస్ఆర్ఎంటీ గైనిక్ వార్డులో స్టాఫ్‌నర్సు ఎస్ఎస్ విజయకుమారి వ్యవహార శైలిపై శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది నిరసన తెలిపారు. ఐదుగురు సిబ్బందిని రోగుల ముందే అవమానించారంటూ 80 మందికిపైగా సిబ్బంది శుక్రవారం విధులు బహిష్కరించారు. దీంతో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విజయకుమారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారంతా తిరిగి విధుల్లో చేరారు. ఇదిలా ఉంటే సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిని కలసి వారు వినతి పత్రం సమర్పించారు. తక్షణం చర్యలు చేపట్టాలని ఆమె నర్సింగ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

వయో పరిమితి పెంచాలని ధర్నా

కాకినాడ సిటీ: రాష్ట్రంలో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అభ్యర్థుల వయో పరిమితి ఐదేళ్లు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ సాధన సమితి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

క్లుప్తంగా

అడబాలకు అభినందన

కాకినాడ రూరల్: అంతర్జాతీయ వాకర్స్ సంఘ జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులైన రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్‌ను శుక్రవారం పలువురు అభినందించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో దంత వైద్యుడు సువర్ణరాజు, తాతారావు, రెడ్నం రాజా, మాజీ తహసీల్దార్ రేలంగి బాపిరాజు తదితరులు అడబాలను అభినందించారు.

11న పంచరత్న సేవ

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళా మందిర్‌లో సరస్వతీ గానసభ ఆధ్వర్యంలో ఈ నెల 11న సాయంత్రం 6 గంటలకు త్యాగరాజ ఆరాధనోత్సవం జరుగుతుందని నిర్వాహకురాలు పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. ఈ సందర్భంగా సంగీత విద్వాంసులచే పంచరత్న సేవ సంగీత కచేరీ ఉంటుందన్నారు.

లక్ష్యాలు పూర్తి చేయండి

కరప: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో స్వామిత్వ సర్వే నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రామ కార్యదర్శులు, సచివాలయ సర్వే, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్వామిత్వ గురించి అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్‌బాల్ పోటీలో విజేతలకు కప్ అందిస్తున్న అతిథులు

నాగమల్లితోట జంక్షన్: స్థానిక జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం శాప్ బాస్కెట్‌బాల్ లీగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పిఠాపురం ఎమ్మెల్యే స్పాన్సర్ నిర్వహించిన ఈ పోటీలను డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ ప్రారంభించారు. బాలుర విభాగంలో 15 జట్లు, బాలికల విభాగంలో 6 జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో అనంతపురం ప్రథమ, రామచంద్రపురం ద్వితీయ, కాకినాడ డీఎస్ఏ జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. బాలుర విభాగంలో చిత్తూరు ప్రథమ, ఏలూరు ద్వితీయ, అనంతపురం జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు ఏపీ బాస్కెట్‌బాల్ సంఘ కార్యదర్శి చక్రవర్తి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా చీఫ్ కోచ్ సురేష్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొజ్జ మాణిక్యాలరావు, భీమేశ్వరరావు, కోచ్‌లు రుద్ర, ప్రసాద్‌రెడ్డి, ఎస్.సురేష్, సీహెచ్‌వీ కృష్ణారెడ్డి, కె.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

జీవో రద్దు చేయాలని ధర్నా

కాకినాడ సిటీ: రోడ్లపై ప్రదర్శనలు, సభలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను రద్దు చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, నాయకులు దువ్వా శేషుబాబ్జీ, జి.బేబీరాణి మాట్లాడారు.

ట్యాంకర్ బోల్తా

కాకినాడ రూరల్: కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్డులో నేమాం గ్రామం పోలవరం వద్ద శుక్రవారం ట్యాంకర్ బోల్తా పడింది. ఇది సూర్యారావుపేట లైట్ హౌస్ వైపు వస్తుండగా రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

కాకినాడ రూరల్: ధనుర్మాసం పౌర్ణమి సందర్భంగా రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శుక్రవారం విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు పవన్‌కుమార్ తదితరులు మహిళలతో సామూహిక లక్ష్మీ పూజ చేయించారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో జ్యూయలరీ కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. శుక్రవారం నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతి గాంచిన సుమారు 50 పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల ప్రముఖ డిజైనర్లు తయారు చేసిన లేటెస్ట్ వస్త్రాలను నగర ప్రజలకు పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో హైదరాబాద్ జ్యూయలరీ అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 8వ తేదీ రాత్రి 9 గంటల వరకూ ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్తంగా...

కొత్త హాజరు విధానం పాటించాలి

కాకినాడ క్రైం: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానాన్ని వైద్యాధికారులంతా పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతి ప్రభ అన్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.

సంక్రాంతి వేడుకలు ప్రారంభం

కాకినాడ క్రైం: నగరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ సంక్రాంతి వేడుకలను వన్ టౌన్ పోలీస్ పరిధిలో అదనపు ఎస్పీ శ్రీనివాస్, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ప్రారంభించారు. జగన్నాథపురం చర్చిస్క్వేర్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

కాకినాడ క్రైం: బోటు దహన ప్రమాదాల నివారణపై కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బోటు యజమానులకు జగన్నాథపురంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వన్ టౌన్ సీఐ కృష్ణ, సాలిపేట ఫైర్ అధికారి ఏసుబాబు పాల్గొన్నారు. అలాగే ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చైతన్య కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

కాకినాడ: ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించే పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ అన్నారు. స్థానిక జగన్నాథపురంలోని ఎఫ్ఆర్‌యూ కేంద్రంలో మహిళా పారిశుధ్య కార్మికులకు శుక్రవారం మెడికోవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 5, 6, 7, 8, 11 డివిజన్లకు చెందిన 126 మంది మహిళా పారిశుధ్య కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 42 మందికి ఈసీజీలు తీశారు. 15 మందికి ఆరోగ్య సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మాజీ డిప్యూటీ మేయర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

రోటరీ సహకారం

బాలాజీచెరువు: వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న వారికి రోటరీ సహకారం అందజేస్తుందని రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షురాలు సురభి శారద అన్నారు. కాకినాడకు చెందిన గాయని కీర్తన పాటల పోటీల్లో ప్రతిభ చూపడంతో పాటు ఇటీవల ప్రైవేట్ సంస్థ నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి రూ.6 లక్షల నగదు బహుమతి సాధించింది. కీర్తనను శారద ఆధ్వర్యంలో అభినందించారు.

క్రమబద్ధీకరించాలని వినతి

కాకినాడ క్రైం: కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున స్టాఫ్ నర్సులు శుక్రవారం కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం సమర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎం.చిన్నారి మాట్లాడుతూ ప్రభుత్వ కాంట్రాక్టు సర్వీసు పదేళ్లు పూర్తయ్యి, రోస్టర్ పాయింట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉన్న స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జీవకుమార్, జోనల్ కోఆర్డినేటర్ ఫిలిప్‌తో పాటు జీజీహెచ్ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఆరోగ్యశ్రీ సేవలు

కాకినాడ సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యశ్రీ సేవలు పటిష్టం చేయడం కోసం ఖాళీ ఆరోగ్యమిత్ర పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

నృత్యం.. మనోరంజకం

కాకినాడ కల్చరల్: స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ వార్షికోత్సవ వేడుకలు, ధనుర్మాస ఉత్సవాలను సంస్థ అధ్యక్షుడు గోపాలనర్సరాజు ప్రారంభించారు. శ్రీకూచిపూడి నృత్యారాధన విద్యార్థులు నృత్య రూపకాలు ప్రదర్శించారు. అనంతరం శ్రీలలితా మండలి సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు. తదుపరి నాట్యాచారిణి వైదేహిని సత్కళావాహిని సభ్యులు సత్కరించారు. కళలకు పూర్వవైభవం తీసుకొస్తున్నామని సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఈవీ కృష్ణమాచార్యులు అన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

కాకినాడ సిటీ: ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుందని కాకినాడ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీభవన్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.ప్రవీణ మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. సీడీపీవో మాధవి సత్య పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తాళ్లరేవు మండలం గాడిమొగకు చెందిన 120 మంది గర్భిణులు, తల్లులకు పోషకాహార కిట్లు అందజేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ పీఅండ్‌సీ హెడ్ టి.విశ్వనాథ్, సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కంట్రిబ్యూషన్ త్వరగా చెల్లించాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): దేవదాయ శాఖకు ఆయా ఆలయాలు, సత్రాల నుంచి చెల్లించాల్సిన కంట్రిబ్యూషన్, సీజీఎఫ్, ఆడిట్ ఫీజు, అర్చక వెల్ఫేర్ ఫండ్ వీలైనంత త్వరగా చెల్లించాలని దేవదాయశాఖ డీసీ ఎం.విజయరాజు సూచించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో శుక్రవారం డివిజన్‌లోని ఈఓలతో సమావేశం నిర్వహించారు. జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి, కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో గోవాలో వర్క్‌షాప్

కాకినాడ: స్మార్ట్ సిటీలలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ల పనితీరుపై ఈ నెల 23, 24 తేదీలలో గోవాలో వర్క్‌షాప్ జరుగనుందని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ తెలిపారు. ఈ అంశంపై స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకట్రావు, సంబంధిత అధికారులతో శుక్రవారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్ కూనల్ కుమార్ పర్యవేక్షణలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. దేశంలోని 20 స్మార్ట్ సిటీ నగరాలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు, ఇతర అంశాలపై సమీక్షిస్తారన్నారు. ఇక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుపై అధికారులతో చర్చించారు.